# జాజి మొగ్గలు

జోరున కురిసే వానలో హోరుమంటున్న గాలి.

హోరుమంటున్న గాలిలో సవ్వడి చేస్తున్న చెట్లు.

అంత వానలో చిక్కు పడిపోయి నందుకు తనని తనే తిట్టుకున్నాడు రంగ.

కనుచూపు మేరలో రిక్షా కనిపించక కళ్ళు చిట్లించాడు.

ఇంతలోనే రోడ్డు మీది దీపాలు గాలివానకి భయపడినట్టు గుప్పుమన్నాయి. గాఢాంధకారం అలుముకుంది.

"ఊరంతా పోయి ఉంటుంది కరెంటు" సన్నగా గొణుక్కుంటూ కనిపించని ఆ చీకటిలో కళ్ళు పెద్దవిచేసుకుని మెల్లిగా అడుగులో అడుగు వేస్తున్నాడు రంగ.

తన బిజినెస్ కిది నిజంగా మంచి సమయమే.

కానీ ఇప్పుడు మూడ్ లేదు.

తనకి కావల్సింది, తన కోరిక తీర్చగలిగేది ఈ సాయంత్రమే సంపాదించ గలిగాడు. ఆ సంబరంలో ఉన్నాడు తను. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూడాలి ఈ రాత్రి.

రంగ పెదవులమీద చిరునవ్వు మెరిసింది.

చేయి జేబు మీదకి వెళ్ళింది. జేబులో ఉన్న జాజిమొగ్గల నెక్లెసు బరువుగా తగిలింది.

ఆ సాయంత్రం జరిగిన సంఘటన రంగ కళ్ళముందు మెదిలింది. శివాలయం, ఆ చిన్నపిల్ల, నెక్లెసు ఒక్కటొక్కటీ కళ్ళముందు కదుల్తున్నాయి. చెయ్యి మళ్ళీ జేబుమీదకి వెళ్ళింది.

ఆ పిల్లకి మూడు నాలుగేళ్ళుంటాయి. మాట్లాడించి చూశాడు కూడా తను. ఇంకా మాటలు సరిగ్గా రావు.

వాళ్ళమ్మతో గుడికి వచ్చినట్టుంది పాపం! తన దృష్టిలో పడింది మెళ్ళో నెక్లెసుతో. చుట్టుపక్కల ఎవరూ లేరు. గుళ్లో ఇదరు ముగ్గురు తప్ప.

జేబులోంచి, రెడీగా ఉన్న చాక్‌లేట్ తీసి ఆ పిల్లకి చూపించి చెయ్యి ఊపాడు తను.

మెల్లిగా ఆ పిల్లని దూరంగా నడిపించి తీసుకువెళ్ళాడు మాటల్తో భుజమ్మీద చెయ్యివేసి మాట్లాడుతున్నట్టే మాట్లాడుతూ తన నైపుణ్యంతో మెళ్లో నెక్లెసు ఊడదీసి జేబులో పడేసుకుని తన దోవపట్టాడు.

అసలు తన స్టయిలూ, తన బట్టలూ చూసి ఎప్పుడూ కూడా ఎవరూ తనని దొంగ అని అనుకోరు.

తను అందంగా దొరబాబులా ఉండబట్టేగా సరోజిని తనని ప్రేమించింది.

దీని తస్సాదియ్యా! ఉన్న పళంగా ఇదెక్కడి వానొచ్చి పడ్డాది?

ఎలిమెంటరీ స్కూల్ వీధిలోకి వచ్చాడు రంగ.

పెద్దతంగేడు చెట్టున్న పెంకుటింటి వసార్లోకి నడిచాడు తల దాచుకుందుకు.

అంతా చీకటి, గాలి ఈలలు తప్ప నిశ్శబ్దంగా నాట్యంచేస్తోంది బయట.

ఆ పెంకుటింటిలోంచి గుడ్డిదీపం వెల్తురు పోతున్న ప్రాణంలా ఉంది.

క్రాపులో వేళ్ళు దూర్చి విదిలించి, చలికి వణుకుతూ చేతులు కట్టుకుని గోడ కానుకుని నిలబడ్డాడు రంగ.

ఉలిక్కి పడ్డాడు మరుక్షణం.

ఇంట్లోంచి ఎవరిదో సన్నగా ఏడుస్తున్న ధ్వని.

అనుమానంగా చెవులు రిక్కించి శ్రద్ధగా విన్నాడు.

ఔను సందేహం లేదు. ఎవరో ఏడుస్తున్నారు.

కిటికీలోంచి లోపలికి చూశాడు.

రెండు మంచాలు. ఒక దానిమీద ఇద్దరు పిల్లలు ఆదమరిచి నిద్ర పోతున్నారు. వాళ్ళ పక్కనే కూర్చుందో స్త్రీ. ఏడుస్తున్న దామె.

పక్కనే రెండో మంచమ్మీద పురుష ఆకారం.

ఆశ్చర్యమే ననిపించింది రంగకి.

పక్కనో మనిషి ఏడుస్తుంటే చీమ కుట్టినట్టయినా లేదా ఆ మహానుభావుడికి.

ఆవిడెందు కేడుస్తుందో పాపం!

జాలిలేని రంగడి గుండెల్లో ఏదో చైతన్యం.

తళుక్కున మెరిసింది ఆకాశంలో మెరుపు.

ఎక్కడో దూరాన పిడుగు పడింది.

నరాలు జివ్వుమంటున్న ఆ చలిగాలితో కలిసి ఏవేవో ఊహలు ము త్తెక్కిస్తున్నాయి రంగకి.

రేపొద్దునకల్లా సరోజని మెళ్ళో తను ఈ నెక్లెసు అలంక రించడం, సరోజని తనది కావడం అయిపోతాయి. లేకపోతే!....ఏంటను కుందో ఈ రంగ అంటే!

"నాకో మంచి నెక్లెసోటి చేయించి పెడితే నీ మాటింటా! నీ తోనే ఉంటా" అంటూ గువిసింది కాదూ!

ఇప్పుడు చూడు నా తడాఖా....లేకపోతేనంట ఆడెవడో వెంక ట్రావుగాడు ఎగరేసుకు పోడానికి చూస్తున్నాడు నా సరోజన్ని. ఎట్టా ఎగరేసుకు పోతాడో నేనూ చూస్తాను. అసలు వాడెవడో, వాడి ముఖం కూడా ఇంతవరకూ తను చూడలేదు.

ఈ నెక్లేసు తీసికెళ్ళి దానిముందు పడేస్తే అయిసైపోదూ. "నువ్వే నా దేవుడివి....ఇంక ఆ వెంకట్రావు ముఖం చూడనే చూడను. నీతోనే ఉంటా!" అంటూ పెనవేసుకోదూ. అయినా ఈ నెక్లెసు పిచ్చేమిటో సరో జినికి.

దేవుడి దయవల్ల సరికొత్త నెక్లెసే కొట్టేశాడు తను. ఇవాళే కొన్నట్టుగా మిలమిలా మెరుస్తోంది.

రంగ మనసు ఊహల్లో బంగారు ఊయల లూగుతోంది. రెక్క లుంటే బాగుండు. సరోజిని దగ్గర వాలచ్చు అనుకుంటున్నాడు.

అదృష్టవశాత్తూ నెక్లెసుమీద "ఎస్" అనే అక్షరం చెక్కబడి ఉంది. సరోజని దగ్గర కోతలు కొయ్యచ్చు.

'నీ పేరులో మొదటి అక్షరం చెక్కించాను నెక్లెసు మీద' అని చెప్పచ్చు. మురిసి పోతుంది. మురిపిస్తుంది.

"ఇంకా ఏడుస్తూనే ఉన్నావా చేసింది చాలక?" విసుగుతో కూడిన మగవాడి గొంతువిని కిటికీలోంచి లోపలికి దృష్టి సారించాడు రంగ.

"ఏవండీ!" దీనంగా ఉందామె పిలుపు.

"ఏవండీ లేదు ఏమీ లేదు. ఇంక నీకూ, నాకూ ఏ సంబంధమూ లేదని చెప్పానా లేదా? తెల్లారగానే బట్టలు సద్దుకుని నీ దోవ నువ్వు చూసుకో."

"అంత మాటనకండి. నేను చెప్పిన దాంట్లో కొంచెం కూడా అబద్ధం లేదండీ! నా మాట నమ్మరా?" జాలిగా అర్థింపు.

"ఇది వరకునించే నేను నిన్ను అనుమానిస్తున్నాను. ఇవాళ దీంతో నా అనుమానం కాస్తా రూఢి అయింది. ఇంక నువ్వేన్ని చెప్పినా నేను నమ్మను." స్థిరమైన జవాబు.

"మిమ్మల్నే నమ్ముకుని, మీరే దైవంగా జీవితం గడుపుతున్న నా మీద మీరసలనుమానం ఎలా పెంచుకోగలిగారు? పైగా ఇవాళ ఈ నెక్లెసు పోవడం ఒకటి....నా ముప్పుకే వచ్చింది.

నెక్లెసు అన్నమాట విని ఉలిక్కిపడ్డాడు రంగ.

అప్రయత్నగా చేయి జేబుమీదకి వెళ్ళింది,

మరింత శ్రద్దగా వాళ్ళ మాటలు వినసాగాడు.

"అయినా ఈ నెక్లెసు చేయించాక ఇప్పటివరకు మూడు నాలుగు సార్లయినా గుడికి వెళ్ళి ఉంటావు. మరి, ఇదివర కెప్పుడూ దాని మెళ్ళో నెక్లెసు పెట్టి తీసికెళ్ళలేదే" ఏదో క్రాసు పరీక్ష చేస్తున్నట్టు పలికిందతని స్వరం.

"అయ్యో శ్రీరామ!" నుదురు బాదుకుందామె.

నేనేం చేసేది? ఇవాళ పక్కింటి వాళ్ళమ్మాయి మెళ్ళో నెక్లెసు చూసి, నాక్కూడా కావాలంటూ ఏడుపు మొదలు పెట్టింది పిల్ల. ఏదో కాసేపు పెడితే దాని సరదా తీరుతుంది కదానని పెట్టాను. ఆ తర్వాత గుడికి అలాగే తీసుకుపోయాను. ఎప్పుడూ అది నాతో గుడికి వచ్చి

నపుడు బయట బొగడ పువ్వులో, గన్నేరు పువ్వులో ఏరుకుంటూ బయటే ఆడుకుంటూ ఉంటుంది. అటువంటిది ఇవాళేమో నేను గుళ్ళోంచి బయటికి వచ్చేసరికి దూరంగా మామిడి చెట్టు కిందనించి మెల్లిగా వస్తోంది. "అదే విటే అంతదూరం పోయావ్! ఒక్క త్తివీ! రా యింటికి పోదాం" అంటూ లాక్కొచ్చేనేగాని, దానిమెళ్లో నెక్లేసు పెట్టేనన్న సంగతే మరిచాను. తీరా ఇంటికొచ్చాక అప్పుడు దాని మెడమీదికి నా దృష్టి పోయింది. అప్పుడే మీరూ వచ్చారు. మీతో చెప్పాను. గుడి దగ్గరే పడిపోయి ఉంటుంది.

వెళ్ళి వెతుకుదాం రమ్మంటే మీరు రానన్నారు. నన్ను నానా మాటలూ అన్నారు. నేను కాళ్ళీడ్చుకుంటూ మళ్ళీ అంతదూరం వెళ్ళి ఆ చుట్టు పక్కలంతా వెతికొచ్చాను. ఎక్కడా లేదు. ఇంటికి రాగానే.... మీరేమో...." చెప్పడం ఆపి రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుందామె. ఒక్క ఉదుటున మంచంమీద లేచి కూర్చున్నాడాయన. "నీ దొంగ ఏడుపులూ, నాటకాలూ కట్టిపెట్టు. పోయిందట పోయింది. ఆ మాటనద్దని ఎన్నిసార్లు చెప్పానిప్పటికి ? తీసుకుపోయి నీ ప్రియుడి కిచ్చుకున్నావు. రామంగాడు మొదటిసారి నీవైపు అదోలా చూసినప్పుడే నేననుకున్నాను, మీ ఇద్దరూ కల్సి నా కొంప ముంచుతారని. రోజూ మీ గురించిన కబుర్లు ఆనోటా, ఈనోటా వింటూనే ఉన్నాను. కానీకి కొరగాని వెధవ వాడు. ఏదో కొంచెం డబ్బు నర్దమని అడగి ఉంటాడు. గుడికి వెళ్ళినట్టు వెళ్ళి కొత్త నెక్లెసు అందించి వొచ్చావు."

"రామ, రామ! ఎందుకు నన్నిలా చిత్రవధ చేస్తారు ? అతనితో నేనెప్పుడూ మాట్లాడికూడా ఎరగనే! మామీద లేనిపోని అనుమానంతో ఎందు కిటువంటి మాటలు...." మరి మాట్లాడలేక పోయిందామె దుఃఖంతో. ఆమెని చూస్తుంటే అమితంగా జాలి వేసింది రంగకి.

"ఓరి దౌర్భాగ్యుడా! కట్టుకున్న భార్యమీదే కథలల్లుతా వెందుకురా? నీ బోడి నెక్లెసు నా దగ్గరుంది. సాయంత్రం నీ పిల్ల మెళ్ళోంచి అది కొట్టేసింది నేనే" అని గట్టిగా అరవాలనిపించింది.

"తెల్లారిలేచి నీ ప్రియుడి దగ్గిరకే పోతావో, నీ పుట్టింటికే పోతావో నీ ఇష్టం. ఈ ఇంట్లో మాత్రం నీకు స్థానం లేదు."

...వచ్చి భర్త కాళ్ళమీద వాలిపోయిందామె.

"మన పిల్లల మీద వొట్టు. నేనే పాపం ఎరగను. నన్ను అనవసరంగా అనుమానిస్తున్నారు. నలుగురిలో నవ్వులపాలు చెయ్యకండి. మిమ్మల్ని విడిచి నేనెక్కడికీ వెళ్ళను. వెళ్ళలేను. మీరే నా సర్వస్వం.

"ఛీ" కాళ్ళమీద పడి మొర పెట్టుకుంటున్న భార్యని కనికరం అన్నది లేకుండా విసిరికొట్టాడు. నిండా ముసుగుతన్ని పడుకున్నాడు.

పిల్లలు పడుకున్న మంచంపట్టెమీద తల ఆన్చి వెక్కి వెక్కి ఏడుస్తుందామె.

రంగ గుండెల్లో ఏదో కదలిక.

జాలన్నది లేని ఆ గుండెల్లో కొత్త గుబులు.

ఏడుస్తున్న ఆమె ఒక వైపు....సరోజిని ఒక వైపు. ఎవరెక్కువో ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు.

ఈ నెక్లెసు రేపు సరోజిని మెళ్ళో అలంకరిస్తే సరోజిని తనదై పోతుంది. ఎన్నాళ్ళ నించో ఎదురు చూస్తున్న తన కోరిక పండుతుంది.

కాని....కాని....ఎలా? ఈ నెక్లెసు వెనక ఉన్న అభాగ్యురాలి కథ తెల్సి కూడా, సరోజిని మెడలో రోజూ ఈ నెక్లెసు చూస్తూ మన శ్శాంతిగా బ్రతకగలడా తను? తల్చుకుంటే రేపీ పాటికి మళ్ళీ ఇంకో నెక్లెస్ ఎక్కడైనా కొట్టెయ్యలేకపోడు. అటువంటప్పుడు ఈ అమాయకురాలి సంసారాన్ని ముక్కలు చెయ్యడ మెందుకు? తను పుట్టి బుద్దెరిగాక ఇంతవరకూ ఒక్క మంచిపని కూడా చెయ్యలేదు....ఔను....అనవసరంగా నిందలు మోస్తున్న ఈ అమాయకురాలి నూరేళ్ళపంట నిలబడేటట్టు తనుచెయ్యగలిగితే అదే పదివేలు. స్థిరంగా నిశ్చయించుకున్న రంగ

తన ఆలోచనకి తనే మెచ్చుకున్నాడు. నెక్లెసుని కిటికీలోంచి లోపలికి జారవిడిచేస్తే సరి.... నెక్లెసు ఇంట్లోనే దొరికినందుకు సంతోషిస్తుం దామె.

అది దొరికిపోయినందువల్ల భార్యని ఇంటివించి గెంటివేయడం ఆ మహానుభావుడి తరం కాదు. ఇంక ఏ కారణం చూపించి గెంటుతాడు ?

వాన వెలిసింది. గాలిహోరుమాత్రం తగ్గలేదు.

మెల్లిగా కిటికీలోంచు లోపలికి నెక్లెసు జారవిడిచిన రంగ తృప్తిగా గాలి పీల్చాడు.

తను చేసిన మంచిపని సరోజినికి చెప్పేసుకోవాలని పించింది. కానీ చెప్పలేదు .... ఔను .... తను దొంగనని సరోజినికి తెలిస్తే ఎలా ? ఈ కథ తనలోనే దాచుకోవాలి. మెల్లిగా రోడ్డుమీదకొచ్చి, ఆ ఇంటివైపు ఒకసారి చూసి ముందుకి సాగిపోయాడు రంగ.

* * *

మర్నాడు సాయంత్రంగానీ సరోజిని ఇంటికి వెళ్ళడానికి వీలుపడలేదు రంగకి.

గాజులు గలగల లాడుతుండగా, జడలో జాజిమొగ్గలు గుబాళిస్తుండగా తలుపు తీసింది సరోజిని.

నిండుగా ఉన్న సరోజిని మెడచూసి నెత్తిన పిడుగు పడింది రంగకి. అడుగు ముందుకి వెయ్యలేకపోయాడు.

"అదే ! అదే జాజిమొగ్గల నెక్లెసు. ఇదెలా సంభవం ?" నవ్వు లొలక పోసింది సరోజిని.

"ఏం ? అలా నిలబడి పోయావ్ ! నువ్వు నా ఇంటికి వచ్చినా, మానినా ఇంక ఇవాళొక్కరోజే."

సరోజిని మాటలు అర్థం కాలేదు రంగకి.

అప్రయత్నంగా లోపలికి నడిచాడు.

తలుపు గడియవేసి వెనకే నడిచింది సరోజిని.

"ఈ నెక్లెసు ఎక్కడిదని చూస్తున్నావు కదూ! నేను నీకు మొన్న చెప్పానుగా! నువ్వుగాని, ఆ వెంకట్రావుగానీ ఎవరుముందు నాకో మంచి నెక్లెసు బహూమతిస్తే వాళ్ళకి నేను అంకితం అని, గుర్తుంది కదూ! నాకు నువ్వెంతో ఆ వెంకట్రావూ అంతే...."

ఏమిటేమిటో చెప్పుకుపోతోంది సరోజిని.

రంగ మనసు ఇక్కడ లేదు.

రాత్రి వాన, ఆ పెంకిటిల్లు, ఆ స్త్రీ, నెక్లెసు కళ్ళల్లో కదులుతున్నాయి. మనసంతా అవే అల్లుకు పోయాయి.

ఇన్నిటి వెనకా ఏదో అనుమానం ....

"రేపే మా ప్రయాణం. నన్ను హైద్రాబాద్ తీసికెళ్ళి అక్కడ మకాం పెడతా నన్నాడు వెంకట్రావు. వీలుచూసుకుని మద్రాసు వెళ్తాం. అవకాశం దొరికినప్పుడు నన్ను సినిమా తారగా చేస్తానన్నాడు. నాకు సినిమాల్లో నటించాలని ఎప్పటినించో కోరికగా ఉంది. అదే చెప్పాను తనితో. నేను సినిమా తారనయితే నా వల్ల అతనికూడా పేరొస్తుం దిగా. అందుకే గావును అవకాశం దొరికి నప్పుడు తప్పకుండా సిని మాలల్లో చేరమన్నాడు." జాజిమొగ్గల నెక్లెసు సవరించుకుంది సరో జిని. బలవంతాన నవ్వుతెచ్చుకున్నాడు రంగ.

సరోజిని భుజమ్మీద చెయ్యి వేశాడు.

నెక్లెసు అందాన్ని చూస్తున్నట్టే చూస్తూ వెనక వైపు చూశాడు. 'S' అన్న అక్షరం కొట్టొచ్చినట్టు కనిపించింది.

కాళ్ళక్రింద భూమి కంపించినట్టయింది.

నిలబడలేక పక్కనున్న బల్లమీద చెయ్యాన్చుకున్నాడు.

"ఏమిటది? అలా అయిపోయావేం? కూర్చో కాసేపు. పాపం! నీకు చాలా బాధగా ఉండి ఉంటుంది." నిర్లక్ష్యంగా నవ్వింది.

"వెంకట్రావిల్లు ఎక్కడుందో నీకు తెల్సా?" నూతిలోంచి వచ్చినట్టుంది రంగ కంఠస్వరం.

"ఎలిమెంటరీ స్కూలు వీధిలో పెద్ద తంగేడు చెట్టున్న పెంకుటిల్లే వాళ్ళది. ఏం? అతనితో దెబ్బలాటకి వెళతావా?" విరగబడి నవ్వుతోంది సరోజిని.

"సరూ...." బాధతో మెలికలు తిరిగింది రంగ హృదయం.

కళ్ళముందు ఎన్నో దృశ్యాలు కనపడుతున్నాయి.

తను పడేసిన నెక్లెసు ఆమెకంటే ముందు అతనే ఏ రాత్రో, తెల్లారు జామునో చూసి తీసుకున్నాడన్నమాట. భార్యని ఇంటినించి తరిమి, ఆ నెక్లెసు సరోజిని మెళ్ళో అలంకరించి, సరోజినితో సహా ఈ ఊరునించి ఉడాయిస్తున్నాడు.

ఊహించుకో గలిగాడు రంగ.

ఏమిటేమిటో చెప్పుకుపోతోంది సరోజిని.

"నీకేం చెప్పినా అర్థం చేసుకొనే స్థితిలో నువ్విప్పుడు లేవు సరూ. పైగా నేను నిన్ను పొందలేక పోయినందుకు ఆ వెంకట్రావుమీద కక్ష కట్టి కట్టు కథ అల్లాననుకుంటావు. వొద్దు....వొద్దు.... నేనేం చెప్పలేను .... నేనేం చెయ్యలేను." మనసులోనే అనుకుంటూ, నీరసంగా

అడుగులు వేస్తూ వెళ్ళిపోతున్న రంగవైపు ఆశ్చర్యంగా చూసింది సరోజిని.

"ఏమిటో ఈ మనిషి" సన్నగా గొణుక్కుంటూ, కింద చీర అంచు సరిచేసుకుందుకు వొంగుంది.

జడలో జాజిమొగ్గలు మెత్తగా, మత్తుగా మెడమీద తగిలాయి.

లేవబోతుంటే జాజిమొగ్గల నెక్లెసు సన్నగా, పదునుగా మెడమీద గుచ్చుకుంది.

★